www.vaarthavedhikasurya.com
RNI NO: TGTEL/25/A0305
# వార్త వేదిక సూర్య
తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY
యాదాద్రి భువనగిరి | సోమవారం 15, డిసెంబర్ 2025 | ఎడిటర్ : పోలోజు శ్రీనివాసచారి | సంపుటి : 01 | సంచిక: 204 | పేజీలు: 08 | వెల: 5/

## బిఆర్ఎస్‌కు భవిష్యత్తు లేదు...
### బిజెపికి అధికారం రాదు: మహేష్ కుమార్ గౌడ్



హైదరాబాద్,డిసెంబర్ 14 (వార్తా వేదిక సూర్య): బిఆర్ఎస్‌కు భవిష్యత్తు లేదు & బిజెపికి అధికారం రాదు..” అని ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి. మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. ఓట్ చోర్ .. గద్దీ చోడ్ పేరిట ఢిల్లీలోని రాం లీలా మైదానంలో ఏఐసిసి చేపట్టిన మహా ధర్నాలో పాల్గొనేందుకు ఆయన వచ్చారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులతో ఆయన ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ మంత్రివర్గ ప్రక్షాళన అంశాన్ని పార్టీ అధిష్టానం చూసుకుంటుందని అన్నారు. తనకు మంత్రివర్గంలో చేరేందుకు ఛాన్స్ లేదన్నారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ (డిసిసి) అధ్యక్షుల ఎంపికలో బిసిలకు అత్యధిక ప్రాధాన్యతనిచ్చామని ఆయన తెలిపారు. ఫ్యూచర్ సిటీ ఏర్పాటుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పట్టుదలగా ఉన్నారని ఆయన చెప్పారు. మిగతా 2లో..

# హస్తం హవా..
## రెండో విడతలోనూ కాంగ్రెస్‌కు సగానికిపైగా సీట్లు

- బీఆర్ఎస్‌కు 25 శాతానికి పైగా సీట్లు
- సిద్దిపేటలో టాప్ గేరులో ‘కారు’
- మూడు మినహా అన్ని జిల్లాల్లో వెనుకంజే
- మలి విడతలోనూ పుంజుకోని బీజేపీ
- కేవలం 6 శాతం స్థానాలతోనే సరి..
- రెండో విడతలో 415 స్థానాలు ఏకగ్రీవం




హైదరాబాద్, డిసెంబర్ 14 (వార్తా వేదిక సూర్య): పంచాయతీ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ హవా కొనసాగుతోంది. తొలి విడతలో మెజారిటీ స్థానాలను కైవసం చేసుకున్న హస్తం పార్టీ.. మలి విడతలోనూ అదే జోరు కొనసాగించింది. ఆదివారం జరిగిన రెండో విడత ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులే అత్యధిక స్థానాల్లో విజయబావుటా ఎగురవేశారు. మలి విడతలో 192 మండలాల పరిధిలోని 3911 గ్రామపంచాయతీలకు ఎన్నికలు జరగ్గా.. 2200కు పైగా స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు గెలుపొందారు. మెజారిటీ సీట్లను సాధించడం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో అధికార పార్టీ తన పట్టును నిలుపుకున్నట్లయింది. మరోవైపు ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీకి కూడా మలి విడత ఫలితాలు కాస్త ఊరటనిచ్చాయి.

1100కు (25 శాతానికి) పైగా సీట్లను గెలుచుకోవడం ద్వారా గ్రామాల్లో తన ఉనికిని చాటుకుంది. మరో ప్రధాన ప్రతిపక్షం బీజేపీకి తొలి విడతతో పోలిస్తే స్వల్పంగా సీట్లు పెరిగాయి. కమ్యూనిస్టులు, ఇతర పార్టీలూ పది శాతానికి పైగా సీట్లను కైవసం చేసుకున్నాయి. మలి విడతలో మొత్తం 4332 సర్పంచ్ స్థానాలకు ఎన్నికలు జరగాల్సి ఉంది. అయితే వీటిలో 415 స్థానాలు ఏకగ్రీవం కాగా.. ఐదు గ్రామాల్లో నామినేషన్లు దాఖలు కాలేదు. మిగిలిన 3,911 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరిగాయి. కాగా, రెండో విడతలో గెలిచిన స్వతంత్ర అభ్యర్థుల్లో ఎక్కువ మంది కాంగ్రెస్ రెబల్సే ఉండడం గమనార్హం.

### ఊళ్లలో కాంగ్రెస్ కళకళ

రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ పార్టీ దశ మారిపోయింది. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ పార్టీ స్థానిక ఎన్నికల్లో డీలా పడిన సంగతి తెలిసిందే. గెలిచిన అభ్యర్థులు కూడా రాత్రికి రాత్రే బీఆర్ఎస్ కండువాలు కప్పేసుకున్నారు. రాష్ట్రంలో అధికారంలోకి రావడంతో క్షేత్రస్థాయిలో హస్తం పార్టీ పరిస్థితి మారిపోయింది. తొలి, మలి విడత సర్పంచ్ ఎన్నికల్లో సగానికిపైగా సీట్లలో కాంగ్రెస్ మద్దతు ఇచ్చిన అభ్యర్థులే గెలిచారు. మలి విడతలో మొత్తం 4332 సర్పంచ్ సీట్లకు గాను కడపటి వార్తలు అందేసరికి కాంగ్రెస్ పార్టీ మద్దతు ఇచ్చిన అభ్యర్థులు 2331స్థానాలను గెలుచుకున్నారు. మరోవైపు జిల్లాల వారీగానూ ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ హవా కొనసాగింది.

స్థానిక ఎన్నికలను సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవడంతో మంత్రులు, పార్టీ ఎమ్మెల్యేలు పూర్తిస్థాయిలో దృష్టి పెట్టారు. దీంతో సిద్దిపేట, ఆసిఫాబాద్, జనగామ మినహా అన్ని జిల్లాల్లోనూ కాంగ్రెస్ పార్టీ ఆధిక్యం స్పష్టంగా కనిపించింది. మహబూబ్‌నగర్, సంగారెడ్డి సహా 20 జిల్లాల్లోనైతే సగానికంటే ఎక్కువ సీట్లను కాంగ్రెస్ గెలుచుకుంది. ఏకగ్రీవమైన 415 పంచాయతీల్లో 90 శాతానికిపైగా కాంగ్రెసవే కావడం విశేషం. మలి విడత ఎన్నికల ఫలితాల్లోనూ కాంగ్రెస్ హవా కొనసాగడంతో పార్టీ నేతల్లో ఉత్సాహం పెరిగింది.

### బీఆర్ఎసకు కాస్త ఊరట..

రెండో విడత సర్పంచ్ ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ పార్టీ వెనకంజలోనే ఉంది. అయితే ఈ ఎన్నికల్లో 25 శాతానికి పైగా సీట్లను కైవసం చేసుకోవడం ఊరట కలిగించే అంశమేనని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. తొలి, రెండో విడత సర్పంచ్ ఎన్నికల్లో 25 శాతానికి పైగా సీట్లు కైవసం చేసుకోవడం ద్వారా క్షేత్రస్థాయిలో ఆ పార్టీ తన ఉనికిని చాటుకుందని, ప్రస్తుత పరిస్థితుల్లో ఇది బీఆర్ఎసకు పెద్ద ఊరటేనని విశ్లేషకులు చెబుతున్నారు. మలి విడతలో కడపటి వార్తలు అందేసరికి బీఆర్ఎస్ పార్టీ మద్దతు ఇచ్చిన అభ్యర్థులు 1195 సీట్లు గెలుచుకున్నారు. మలి విడతలోనూ కేసీఆర్, హరీశ్‌లు ప్రాతినిధ్యం వహిస్తున్న సిద్దిపేటలో బీఆర్ఎస్ హవా కొనసాగింది. ఈ జిల్లాలో మలి విడతలో 186 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరగ్గా వందకు పైగా సీట్లలో బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులే గెలిచారు. ఇతరులు 36, కాంగ్రెస్ పార్టీ కేవలం 26 సీట్లలో విజయం మిగతా 2లో..



## రెండో విడతలో 85.86 శాతం

- ఓటు హక్కు వినియోగించుకున్న 46,70,972 మంది
- భువనగిరి జిల్లాలో అత్యధికంగా 91.72 శాతం..
- నిజామాబాద్‌లో అత్యల్పంగా 76.71 శాతం పోలింగ్

హైదరాబాద్,డిసెంబర్ 14 (వార్తా వేదిక సూర్య): రెండో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రక్రియ ముగిసింది. 3911 పంచాయతీల పరిధిలోని సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు ఆదివారం ఉదయం 7 గంటల నుంచి పోలింగ్ ప్రారంభమైంది. రాష్ట్ర ఎన్నికల సంఘం అందించిన సమాచారం మేరకు మధ్యాహ్నం ఒంటి గంటకు 80.84 శాతం పోలింగ్ నమోదైంది. అయితే అప్పటికే ఓట్లు వేసేందుకు క్యూలైన్లలో ఉన్నవారికి సమయం ముగిసిన తర్వాత కూడా ఓటు వేసేందుకు అవకాశం కల్పించారు. దీంతో 85.86 శాతంతో మొత్తం 46,70,972 ఓట్లు పోలయ్యాయి. రెండో విడత ఎన్నికల్లో 54,40,339 మంది ఓటు హక్కు వినియోగించుకోవాల్సి ఉండగా.. 46,70,972 మంది ఓటేశారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో అత్యధికంగా 91.72 శాతం పోలింగ్ నమోదవగా.. నిజామాబాద్ జిల్లాలో అత్యల్పంగా 76.71న్న నమోదైంది. పోలింగ్ ముగిసిన వెంటనే లెక్కింపు మిగతా 2లో..

### 17న మూడో విడత ఎన్నికలు

మూడో విడత పంచాయతీ ఎన్నికలను ఈ నెల 17న చేపట్టనున్నారు. సోమవారం సాయంత్రంతో ఆయా గ్రామాల్లో ప్రచారం ముగియనుంది. ఎస్ఈసీ షెడ్యూల్ ప్రకారం మూడో విడతలో మొత్తం 4157 సర్పంచ్ స్థానాలకు ఎన్నికలు జరగాల్సి ఉండగా.. 394 చోట్ల ఏకగ్రీవం అయ్యాయి. అదేవిధంగా 11 పంచాయతీల్లో నామినేషన్లు దాఖలు కాలేదు. దీంతో 3752 సర్పంచ్ స్థానాలకు జరిగే ఎన్నికల్లో ఒక్కో స్థానానికి సగటున నలుగురు చొప్పున 12640 మంది బరిలో ఉన్నారు. అదేవిధంగా 36,434 వార్డులకు గాను 7916 ఏకగ్రీవం అయ్యాయి. 112 స్థానాల్లో నామినేషన్లు దాఖలు కాలేదు. మిగిలిన 28,406 స్థానాలకు జరిగే ఎన్నికల్లో 75,283 మంది అభ్యర్థులు పోటీపడుతున్నారు. మూడు విడతల్లో జరిగిన ఎన్నికల్లో విజేతలుగా నిలిచిన సర్పంచ్, వార్డు సభ్యులు ఈ నెల 20న ప్రమాణం చేయనున్నారు.

## బీజేపీ డీఎన్ఏలోనే
# ఓట్ చోరీ..

- కాంగ్రెస్‌లో సత్యం, అహింస - సత్యానికి అసత్యానికి మధ్య పోరాటం
- ఆ రెండింటి ద్వారానే పోరాడి.. మోదీని ఓడించి.. గద్దె దించుతాం
- కేంద్ర ఎన్నికల సంఘం బహిరంగంగా బీజేపీ కోసం పనిచేస్తోంది
- ఓట్‌చోరీలో దొరికిపోయామని మోదీ, షాలకు అర్థమైంది
- సభలో నా ప్రశ్నకు జవాబిస్తున్నప్పుడు షా చేతులు వణికాయి
- సత్యం గెలవడానికి సమయం పట్టొచ్చు.. కానీ తుది గెలుపు మాదే
- ‘ఓట్ చోర్-గద్దీ ఛోడ్’ సభలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ
- దశలవారీగా రాజ్యాంగాన్ని నాశనం చేసే కుట్ర: మల్లికార్జున ఖర్గే
- దమ్ముంటే బ్యాలెట్ విధానంలో పోటీ చేసి గెలవండి: ప్రియాంక

న్యూఢిల్లీ, డిసెంబర్ 14 (వార్తా వేదిక సూర్య): దేశంలో సత్యానికి, అసత్యానికి మధ్య పోరాటం నడుస్తోందని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. మహాత్మాగాంధీ చూపిన సత్యం, అహింస మార్గంలో పోరాడడం ద్వారానే.. నరేంద్ర మోదీ, ఆర్ఎస్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించుతామని చెప్పారు. బీజేపీ డీఎన్ఏలోనే ఓట్ చోరీ ఉందని, కాంగ్రెస్ డీఎన్ఏలో సత్యం, అహింస ఉన్నాయని ఆయన వ్యాఖ్యానించారు. కేంద్ర ఎన్నికల సంఘం బహిరంగంగానే బీజేపీ కోసం



పనిచేస్తోందని మండిపడ్డారు. ఆదివారం న్యూఢిల్లీ రాంలీలా మైదానంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ‘ఓట్ చోర్- గద్దీ ఛోడ్’ మెగా ర్యాలీ జరిగింది. ఈ ఆందోళనలో కాంగ్రెస్ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంకాగాంధీ, కేసీ వేణుగోపాల్, అభిషేక్ మను సింఘ్వీ, జైరాం రమేశ్, చిదంబరం సహా సీడబ్ల్యూసీ సభ్యులు, ఏఐసీసీ కీలక నేతలు, ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, మంత్రులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. మెగా ర్యాలీకి ముందు కాంగ్రెస్ కేంద్ర కార్యాలయంలో పీసీసీ అధ్యక్షులు, సీఎల్పీ నేతలతో కలిసి మిగతా 2లో..



## దక్షిణ భారతంపైకి చలిగాలులు
### అరకు లోయలో 4.4 డిగ్రీల ఉష్ణోగ్రత


విశాఖపట్నం, డిసెంబర్ 14 (వార్తా వేదిక సూర్య): వాయవ్య, మధ్య భారతంలో అధికపీడనం కొనసాగుతోంది. దీని ప్రభావంతో సైబీరియా నుంచి వచ్చే శీతల గాలులు మధ్య భారతం, దానికి ఆనుకుని ఉన్న దక్షిణ భారతంపైకి వీస్తున్నాయి. చాలాకాలం తర్వాత చలిగాలులు తెలంగాణ, కోస్తా, రాయలసీమ, ఉత్తర కర్ణాటక మీదుగా తమిళనాడు లోని పలు ప్రాంతాలకు విస్తరించాయి. మిగతా 2లో..

## ఆస్ట్రేలియా బాండీ బీచ్‌లో ఉగ్రవాదుల కాల్పుల కలకలం

- 10 మంది మృతి, 29 మందికి తీవ్ర గాయాలు
- తుపాకీతో కాల్పులు జరుపుతున్న షూటర్‌ను అడ్డుకున్న సామాన్య పౌరుడు
- యూదుల పండుగను లక్ష్యంగా చేసుకుని దాడి జరిగిందని ప్రకటన





ఆస్ట్రేలియా: సామాన్య పౌరుల ధైర్యాన్ని కొనియాడిన ఆస్ట్రేలియా ప్రధాని ఆస్ట్రేలియాలోని సిడ్నీలో దారుణమైన ఉగ్రదాడి చోటు చేసుకుంది. ప్రఖ్యాత బాండీ బీచ్‌లో ఉగ్రవాదులు జరిపిన విచక్షణారహిత కాల్పుల్లో 10 మంది ప్రాణాలు కోల్పోగా, 29 మంది గాయపడ్డారు. ఈ భయానక ఘటనలో ఓ సామాన్య పౌరుడు చూపిన అసమాన ధైర్యం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. ప్రాణాలకు తెగించి, మిగతా 2లో..

## కవిత కెసిఆర్ కుమార్తె కాబట్టే లీడర్ అయ్యారు: జగ్గా రెడ్డి



హైదరాబాద్,డిసెంబర్ 14 (వార్తా వేదిక సూర్య): తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కె. కవిత బిఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు కుమార్తె కావడం వల్లే నాయకురాలు అయ్యారని పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గా రెడ్డి అన్నారు. తనది ఎప్పుడైనా డైరెక్ట్ ఫైట్ ఉంటుందని కాగా బిఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి టి. హరీష్ రావు వెనుక నుంచి పొడుస్తారని జగ్గా రెడ్డి ఆదివారం విలేకరుల సమావేశంలో విమర్శించారు. తాను, హరీష్ రావు ఇద్దరమూ రాజకీయ శత్రువులమే అయినా పని విషయంలో ఇద్దరమూ పని పురుగులం అని ఆయన తెలిపారు. సంగారెడ్డిలో తాను రాహుల్ గాంధీ సభ నిర్వహించినప్పుడు హరీష్ రావును కెసిఆర్ తిట్టినట్లు తనకు సమాచారం ఉందన్నారు.

దీంతో ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో తనను ఓడించేందుకు హరీష్ రావు తీవ్రంగా ప్రయత్నించారని ఆయన చెప్పారు. హరీష్ రావుపై మిగతా 2లో..

## ఈ నెల 19న తెలంగాణ భవన్‌కు కేసీఆర్..
### ఎమ్మెల్యేలు, పార్టీ కార్యవర్గ సభ్యులతో భేటీ



హైదరాబాద్,(వార్తా వేదిక సూర్య): బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఈ నెల 19వ తేదీన తెలంగాణ భవన్‌కు రానున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సంయుక్త సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశం సందర్భంగా కృష్ణా, గోదావరి జలాల విషయంలో, తెలంగాణ రాష్ట్రానికి, పదేండ్ల బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన నీటిపారుదల ప్రాజెక్టులను నేటి కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు తీసుకుపోవడంలో చూపిస్తున్న నిర్లక్ష్య వైఖరి మీద చర్చించనున్నారు. దానితోపాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గోదావరి, కృష్ణా జలాలను కొల్లగొడుతున్నా కూడా దానిని అడ్డుకునే విషయంలో రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. ఇటువంటి సందర్భంలో తెలంగాణ ప్రజల రైతాంగ సాగునీటి హక్కులను కాపాడుకోవడానికి మరో ప్రజా ఉద్యమం తప్పదని భావించడం జరుగుతున్నది. ఇందులో భాగంగా తదుపరి నిర్మించబోయే తెలంగాణ ప్రజా ఉద్యమాలకు సంబంధించి పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో లోతుగా చర్చ జరగనున్నది. పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం 91 టీఎంసీలు కేటాయిస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు కేవలం 45 టీఎంసీలు ఇస్తే చాలు అని కేంద్రం ముందు దేబరించడం బాధాకరం.

www.vaarthavedhikasurya.com
వార్త వేదిక సూర్య
తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY

# హస్తం హవా..

(మొదటి పేజీ తరువాయి)

సాధించాయి. హరీశ్ నియోజకవర్గంలోని 91 పంచాయతీల్లో 78 బీఆర్ఎస్ గెలుచుకోవడం విశేషం. ఇక్కడ కాంగ్రెస్ 5 స్థానాలకే పరిమితమైంది. జనగామ జిల్లాలో కాంగ్రెస్ 30 సర్పంచ్ సీట్లు గెలుచుకుంటే.. బీఆర్ఎస్ 37 సీట్లు సొంతం చేసుకుంది. ఆసిఫాబాద్ జిల్లాలో కాంగ్రెస్‌కు 24, బీఆర్ఎసకు 40 సీట్లు వచ్చాయి.

**మలి విడతలోనూ పుంజుకోని బీజేపీ**

రాష్ట్రంలో ప్రత్యామ్నాయంగా ఎదగాలని చూస్తు న్న బీజేపీ.. మలి విడత పంచాయతీ ఎన్నికల్లోనూ తన బలాన్ని చూపలేక పోయింది. కడపటి వార్తలు అందేసరికి ఆ పార్టీ మద్దతు ఇచ్చిన అభ్యర్థులు 250కి పైగా సీట్లలో గెలిచారు. బీజేపీ గెలుచుకున్న సీట్లలో సింహభాగం ఆ పార్టీ ఎమ్మెల్యేలు ప్రాతిని? ధ్యం వహిస్తున్న నియోజకవర్గాలవే కావడం గమనార్హం. అంటే మలివిడత ఎన్నికలు జరిగిన పంచాయతీల్లో బీజేపీ వాటా కేవలం ఆరు శాతం.

# రెండో విడతలో 85.86 శాతం

(మొదటి పేజీ తరువాయి)

ప్రారంభించారు. ఎక్కువ మంది ఓటర్లు క్యూలైన్లలో ఉన్నచోట మాత్రం కొంత ఆలస్యం జరిగింది. ఓట్ల లెక్కింపు తర్వాత సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాల్లో పోటీపడి విజేతలుగా నిలిచిన వారిని సంబంధిత ఆర్‌వోలు అక్కడికక్కడే ప్రకటించారు. ఎస్ఈసీ అందించిన సమాచారం ప్రకారం ఆదివారం రాత్రి 7 గంటల వరకు 1708 సర్పంచ్, 15,918 వార్డు సభ్యుల స్థానాల ఫలితాలను వెల్లడించారు. అదే సమయంలో ఉప సర్పంచుల ఎన్నిక ప్రక్రియను కూడా పూర్తిచేసినట్లు సంబంధిత విభాగాలు తెలిపాయి. కాగా, పోలింగ్ ప్రక్రియను ఎస్ఈసీ కమిషనర్ రాణి కుముదిని వెబ్‌కాస్టింగ్ ద్వారా పరిశీలించారు.

**ప్రశాంతంగా రెండోదశ పోలింగ్**

రెండో దశ పోలింగ్ సందర్భంగా చెదురుమదురు సంఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా జరిగిందని డీజీపీ శివధర్‌రెడ్డి తెలిపారు. సమస్యాత్మక ప్రాంతాల్లో ఫ్లైయింగ్ స్క్వాడ్స్‌ను, వ్యూహాత్మక నిఘా బృందాలను నియమించామని.. దీంతో చిన్న అలజడి చెలరేగినా నిమిషాల్లో అదనపు పోలీసులు అక్కడకు చేరుకుని పరిస్థితిని చక్కదిద్దగలిగారని ఆయన వివరించారు. మొదటి, రెండో దశ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూసిన పోలీసు సిబ్బంది, అధికారులను డీజీపీ అభినందించారు.

# దక్షిణ భారతంపైకి చలిగాలులు

(మొదటి పేజీ తరువాయి)

వీటి ప్రభావంతో రాష్ట్రంలో చలి తీవ్రత కొనసాగుతోంది. దీనికితోడు అనేక ప్రాంతాల్లో మంచు దట్టంగా కురుస్తోంది. పది రోజుల నుంచి చలి గాలుల జోరు తగ్గలేదు. ఉత్తరకోస్తాలో ఏజెన్సీ ప్రాంతాలతోపాటు రాయలసీమలో అనేక ప్రాంతాల్లో రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే మూడు నుంచి ఐదు డిగ్రీలు తక్కువగా నమోదయ్యాయి. ఆదివారం అరకులోయలో 4.4 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. మైదాన ప్రాంతంలోని శ్రీసత్యసాయి జిల్లా ఆర్.అనంతపురంలో 8.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.


**కేసీఆర్ అధ్యక్షతన బీఆర్ఎస్ఎల్పీ భేటీ..**

హైదరాబాద్, డిసెంబర్ 14: రైతుల నీటి హక్కులపై ఉద్యమానికి ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ సమాయత్తమవుతోంది. బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్ అధ్యక్షతన బీఆర్ఎస్ఎల్పీ సమావేశం కానుంది. డిసెంబర్ 19వ తేదీన హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఈ సమావేశం జరగనుంది. కృష్ణా, గోదావరి జలాలతోపాటు సాగునీటి ప్రాజెక్టులపై ఈ సమావేశంలో చర్చించనున్నారు. అంతేకాకుండా.. తదుపరి నిర్మించబోయే తెలంగాణ ప్రజా ఉద్యమాలకు సంబంధించి పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో లోతుగా చర్చించనుంది. పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు గత బిఆర్ఎస్ ప్రభుత్వం 91 టీఎంసీలు కేటాయిస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రస్తుతం కేవలం 45 టీఎంసీలు ఇస్తే చాలని కేంద్రం ముందు దేబిరించడం బాధాకరమని బీఆర్ఎస్ పార్టీ అభిప్రాయపడుతుంది. రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి 45 టీఎంసీలకు అంగీకరిస్తూ కేంద్రం వద్ద మోకరడం రాష్ట్ర రైతాంగ ప్రయోజనాలను తాకట్టు పెట్టడమేనని బీఆర్ఎస్ భావిస్తోంది. రాష్ట్రానికి తీవ్రమైన అన్యాయం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వం వైఖరన్నట్లుగా ఉందని బీఆర్ఎస్ చెబుతోంది. తెలంగాణ రాష్ట్రానికి ముఖ్యంగా పాలమూరు - రంగారెడ్డి నల్లగొండ ప్రజల రైతాంగ ప్రయోజనాలు దెబ్బతింటున్న నేపథ్యంలో, తెలంగాణ నుంచి ఎనిమిది మంది బిజెపి ఎంపీలు ఉండి కూడా ఒక్కరూ మాట్లాడడం లేదని వ్యాఖ్యానిస్తోంది. ఇంకా చెప్పాలంటే... బీజేపీ.. తెలంగాణ ప్రయోజనాలను గండి కొడుతున్నట్లుగా ఉందని స్పష్టమవుతున్నదని బీఆర్ఎస్ చెబుతుంది. తెలంగాణ రాష్ట్రానికి సాగునీటి విషయంలో కాదు.. కావేరి తదితర నదుల అనుసంధానం పేరుతో ఆంధ్ర రాష్ట్ర జల దోపిడికి సహకరిస్తున్న బీజేపీ విధానాన్ని ఎదుర్కోవాలంటే.. తెలంగాణ సమాజం మరో సారి ప్రత్యక్ష పోరాటాలే శరణ్యమని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ భావిస్తున్నారు.

# ఆస్ట్రేలియా బాండీ బీచ్‌లో ఉగ్రవాదుల కాల్పుల కలకలం

(మొదటి పేజీ తరువాయి)

ఓ ఉగ్రవాదిపైకి దూసుకెళ్లి అతని చేతిలోని షాట్‌గన్‌ను లాక్కున్నాడు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ఒకటి సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ఫుట్‌పాత్‌పై నిలబడి ఓ దుండగుడు కాల్పులు జరుపుతుండగా, సమీపంలో కారు వెనుక నక్కిన ఓ వ్యక్తి ఒక్కసారిగా అతనిపైకి దూకాడు. ఇద్దరి మధ్య జరిగిన పెనుగులాటలో ఉగ్రవాది చేతిలోని గన్‌ను లాక్కుని, అతడిని కిందపడేశాడు. ఆ గన్‌ను దుండగుడికి ఎక్కుపెట్టడంతో అతను వెనక్కి తగ్గాడు. అనంతరం ఆ వ్యక్తి తుపాకీని ఓ చెట్టుకు ఆనించి, తాను దుండగుడ్ని కాదు అని పోలీ సులు గుర్తించేలా శాంతియుతంగా చేతులు పైకెత్తాడు. ఆదివారం సాయంత్రం యూదుల 'హనుక్కా' పండుగ వేడుకలు జరుగుతున్న



ప్రదేశంలో ఈ దాడి జరిగింది. దీనిని ఉగ్రవాద చర్యగా అధికారులు ప్రకటించారు. ఈ దాడిని ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్ తీవ్రంగా ఖండించారు. "యూదుల పండుగ రోజున వారిని లక్ష్యంగా చేసుకుని చేసిన క్రూరమైన దాడి ఇది. ఈ విపత్కర పరిస్థితుల్లో ప్రాణాలకు తెగించి ఇతరులను కాపాడిన సామాన్యులు నిజమైన హీరోలు. వారి ధైర్యం ఎన్నో ప్రాణాలను నిలబెట్టింది" అని ఆయన అన్నారు.

ఈ దాడిలో ఇద్దరు దుండగులు పాల్గొన్నట్లు పోలీసులు నిర్ధారించారు. వారిలో ఒకరిని కాల్చి చంపగా, మరొకరు తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మూడో వ్యక్తి ప్రమేయంపైనా పోలీసులు విచారణ జరుపుతున్నారు. ఈ ఘటనపై న్యూ సౌత్ వేల్స్ ప్రీమియర్ క్రిస్ మిన్స్ స్పందిస్తూ, "ఈ విషాదంలో కూడా అద్భుతమైన ధైర్యాన్ని ప్రదర్శించే సామాన్యులు మన మధ్య ఉన్నారనడానికి ఇదే నిదర్శనం" అని పేర్కొన్నారు.

# సర్పంచ్ విజేతలు వీరే..

భూదాన్ పోచంపల్లి, డిసెంబర్ 14 (వార్త వేదిక సూర్య): భూదాన్ పోచంపల్లి మండలంలో 21 గ్రామ పంచాయతీలకు గాను గతంలో శివారెడ్డి గూడెం గ్రామ పంచాయతీ ఏకగ్రీవ ఎన్నికయింది. మండలంలో ఆదివారం జరిగిన 20 గ్రామ పంచాయతీలు, 177 వార్డ్ మెంబర్ల స్థానాలకు ఎన్నికలు ప్రతిష్టాత్మంగా జరిగాయి. కాంగ్రెస్ టిఆర్ఎస్ పార్టీల మధ్య పోరు ఉత్కంఠంగా జరిగింది. మొదట బ్యాలెట్ ఓట్లను లెక్కించి వార్డ్ మెంబర్లు కౌంటింగ్ అనంతరం సర్పంచ్ ఓట్లను లెక్కించారు. మండలంలో సర్పంచులను విజేతలుగా ప్రకటించారు.

**సర్పంచి విజేతలు వీరే**

దేశ్ ముఖి : దుర్గం జంగయ్య ( బి ఆర్ ఎస్ ),పిల్లాయి పల్లి : పెరుమాండ్ల మహాలక్ష్మి దానయ్య ( కాంగ్రెస్), జగత్ పల్లి : ఇట్ట మోని గీతా మహేష్ ( కాంగ్రెస్), పెద్దగూడెం : పకీరు లతా నర్సిరెడ్డి (కాంగ్రెస్ ), జూలూరు : కాసుల అంజయ్య ( కాంగ్రెస్ ),కప్రాయపల్లి : రా గీరు నర్మద సత్యనారాయణ ( బి ఆర్ ఎస్ ),పెద్ద రావులపల్లి : మోటే బాలకృష్ణ ( కాంగ్రెస్), గౌస్ కొండ : మునుకుంట్ల నరేష్ గౌడ్ (కాంగ్రెస్ ), రామ లింగంపల్లి : మండల రేనమ్మ (బి ఆర్ఎస్), ఇంద్రియాల : ధీరావత్ వెంకటేష్ నాయక్ (బి ఆర్ఎస్ ), జలాల్ పూ ర్ : శాపాక లింగస్వామి (బి ఆర్ఎస్ ), మెహర్ నగర్ : చిలువే రు లక్ష్మయ్య (బి ఆర్ ఎస్ ) ,భీమనపల్లి : కర్నాటి కావ్య పాండు ( బి. ఆ ర్.ఎస్) , కనుముకుల : చుక్క శోభ శంకర్ ( కాంగ్రెస్ ),
జీబ్లక్ పల్లి : ఆర్ల కావ్య వెంకటేష్ ( బిఆర్ఎస్ ), దంతూర్ : గోరుగంటి సువర్ణ రవీందర్ ( కాంగ్రెస్),
వంక మామిడి : మచ్చ శ్రీనివాస్ (కాంగ్రెస్ ), ధర్మారెడ్డి పల్లి :సామ రవీందర్ రెడ్డి ( బి ఆర్ఎస్ ), దోతి గూడెం : యాట జంగయ్య ( ఇండిపెండెంట్), అంతమ్మ గూడెం : గుమ్మి జంగారెడ్డి (కాంగ్రెస్)
ఎన్నికయ్యారు. కాంగ్రెస్ కు 10, బి ఆర్ఎస్ కు 9 , ఇండిపెండెంట్ 1 సర్పంచులు ఎన్నికయ్యారు .

# సదర్శాపురం గ్రామ అభివృద్ధికై నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటా..

**కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థి హరిప్రసాద్ ముమ్మరం ప్రచారం.**

మోత్కూరు, డిసెంబర్ 14(వార్తా వేదిక సూర్య): మోత్కూరు మండలం సదర్శాపురం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ బలపర్చిన సర్పంచ్ అభ్యర్థి వద్రే హరిప్రసాద్ అదివారం నాడు భారీ జన సమూహం మధ్య ప్రచారాన్ని ముమ్మరంగా నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన వీధుల గుండా సాగిన ఈ ప్రచార కార్యక్రమానికి గ్రామస్తులు,







పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున హాజరై మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా హరిప్రసాద్ మాట్లాడుతూ సదర్శాపురం గ్రామ అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమన్నారు. తాగునీరు, అంతర్గత రహదారులు, డ్రైనేజీ, వీధి దీపాలు, పారిశుధ్యం వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తానని ప్రజలకు భరోసా ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండటంతో పాటు స్థానిక ఎమ్మెల్యే మందుల సామేల్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి , జిల్లా మంత్రుల సహకారంతో గ్రామానికి ఎక్కువ నిధులు తెచ్చి సమగ్ర అభివృద్ధి సాధిస్తానని తెలిపారు.. ఈ ప్రచారంలో తనకు ఎన్నికల సంఘం కేటాయించిన బ్యాట్ గుర్తుకు తమ అమూల్యమైన ఓటును వేసి, అత్యధిక మెజార్టీతో గెలిపించాలని గ్రామస్తులను హరిప్రసాద్ విజ్ఞప్తి చేశారు. గ్రామ ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని పరిష్కారం చూపించే సర్పంచ్‌గా పనిచేస్తానని, అందరి సహకారంతో సదర్శాపురం గ్రామాన్ని జిల్లాలోనే ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని అన్నారు. .ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొని అభ్యర్థికి తమ మద్దతు ప్రకటించారు.

# బీజేపీ డీఎన్ఏలోనే ఓట్ చోరీ..

(మొదటి పేజీ తరువాయి)

రాహుల్ గాంధీ విందు చేశారు. అక్కడి నుంచి నేరుగా ర్యాలీకి చేరుకున్నారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీలతోపాటు జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్, ఇతర ముఖ్య నేతలు కూడా ఈ ర్యాలీకి హాజరయ్యారు. సభలో ప్రసంగించిన రాహుల్‌గాంధీ.. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్, ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి పేర్లు ప్రస్తావించి మరీ.. వారు బీజేపీ కోసం పనిచేస్తున్నారని ఆరోపించారు. తాము పనిచేసేది దేశం కోసమని, మోదీ కోసం కాదని సత్యాన్ని ఇకనైనా వారు గ్రహించాలని అన్నారు. బిహార్ ఎన్నికల సమయంలో ఓటర్లకు రూ.10వేల చొప్పును బీజేపీ బదిలీ చేసినా.. ఈసీ ఎటువంటి చర్యలూ తీసుకోలేదని మండిపడ్డారు. "సత్యానికి అసత్యానికి మధ్య జరుగుతున్న పోరులో.. కేంద్ర ఎన్నికల కమిషన్ బీజేపీతో కలిసి పనిచేస్తోంది. కేంద్రం చెప్పినట్లే చేస్తోంది. మేము.. నిస్సందేహంగా సత్యం వైపు నిలబడ్డాం. నరేంద్ర మోదీ, ఆర్ఎసఎస్ ప్రభుత్వాన్ని అధికారం నుంచి దింపేస్తాం. వారు అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఓట్ చోరీకి పాల్పడుతున్నారు. కానీ.. మాకు ప్రజాస్వామ్య సిద్ధాంతాలపై నమ్మకం ఉంది.

ఈ పోరాటంలో విజయం సాధించడానికి, సత్యం గెలవడానికి సమ యం పట్టొచ్చు. కానీ.. అంతిమ విజయం సత్యానిదే. సత్యం, అహింస మార్గంలోనే మేం పనిచేస్తాం" అని రాహుల్ పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ సభ్యులపై ఎటువంటి చర్యలూ తీసుకోకుండా కేంద్రం ఓ చట్టా న్ని తీసుకొచ్చిందని.. కానీ, తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ చట్టాన్ని మారు స్తామన్నారు.

**దొరికిపోయామనిగ్రహించారు..**

'ఓట్ చోరీ' విషయంలో తాము దొరికిపోయినట్లు ప్రధాని నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షాతో సహా బీజేపీ నాయకులు గ్రహించారని రాహుల్ గాంధీ తెలిపారు. అందుకే మోదీతోపాటు ఆ పార్టీ నాయకుల్లో ఆత్మవిశ్వాసం సడలిందన్నారు. లోక్‌సభలో 'ఓట్ చోరి'పై చర్చ సందర్భంగా తన ప్రశ్నలకు సమాధానం ఇస్తున్నప్పుడు అమిత్ షా చేతులు అందుకే వణికాయన్నారు. బీజేపీ నాయకుల ఆత్మవిశ్వాసం, ధైర్యం కేవలం అధికారం నుంచే వస్తాయని, ఓట్ చోరీతో వాళ్లు ఆ అధికారం దక్కించుకున్నారని మండిపడ్డారు. "మోదీ, షా... మీరు ఎన్ని ప్రసంగాలు చేసినా, అంతిమంగా సత్యానిదే విజయం... మేం మిమ్మల్ని సత్యం, అహింసతో ఓడిస్తాం," అని రాహుల్ హెచ్చరించారు. కాగా.. దశలవారీగా రాజ్యాంగాన్ని నాశనం చేసేందుకు బీజేపీ, ఆర్ఎసఎస్ కుట్ర పన్నుతున్నాయని ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే ఆరోపించారు.

**దశలవారీగా రాజ్యాంగాన్ని నాశనం చేస్తారు**

"బీజేపీది ఆర్ఎసఎస్ సిద్ధాంత కర్త గోల్వాల్కర్, మోహన్ భాగవత్, మనుస్మృతి భావజాలం. ఆ ఆలోచనా విధానం దేశాన్ని కాపాడదు. నాశనం చేస్తుంది. మోదీ, బీజేపీ అదే మార్గాన్ని అనుసరిస్తున్నారు. దశలవారీగా రాజ్యాంగాన్ని నాశనం చేస్తారు. హిందూ మతం, హిందుత్వం పేరుతో పేదలను బానిసలుగా ఉంచేందుకు ప్రయత్నిస్తున్నారు" అని మల్లికార్జున ఖర్గే మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చే సమయానికి నరేంద్ర మోదీ, అమిత్ షా పుట్టారా అని నిలదీశారు. "బీజేపీ వాళ్లు ద్రోహులు, నాటకాలు ఆడేవారు. ప్రజా సమస్యలపై చర్చించేందుకు ప్రధాని మోదీ పార్లమెంటుకు రారు. మేము అడిగే ఏ ప్రశ్నకూ సమాధానం చెప్పరు. వందే మాతరంపై దేశ ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారు" అని నిప్పులు చెరిగారు. ఓటు హక్కును, రాజ్యాంగాన్ని కాపాడాలంటే.. 'ఓట్ చోరీకి' పాల్పడుతున్న బీజేపీని అధికారం నుంచి తొలగించాలని పిలుపునిచ్చారు.

# కవిత కెసిఆర్ కుమార్తె కాబట్టే లీడర్ అయ్యారు: జగ్గా రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

కోపంతోనే తాను బిఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరానని కవిత చేసిన వ్యాఖ్యలను ఆయన ప్రస్తావిస్తూ మీ మధ్య ఉన్న పంచాయితీలోకి తనను ఎందుకు లాగుతారని ప్రశ్నించారు. తాను పార్టీ మారడానికి హరీష్ రావుకు సంబంధం లేదన్నారు. నాడు వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆహ్వానం మేరకు తాను కాంగ్రెస్‌లో చేరానని జగ్గారెడ్డి చెప్పారు. కెసిఆర్, చంద్రబాబు నాయుడు కూడా గతంలో కాంగ్రెస్‌లో నాయకులేనని ఆయన తెలిపారు. నేను డిస్టర్బ్ అయ్యాను.. పార్టీలో తాను ఒక విషయంలో డిస్టర్బ్ అయ్యానని ఆయన బాధను వ్యక్తం చేశారు. అదేమిటని విలేకరులు పదేపదే ప్రశ్నించినా, ఆయన చెప్పకుండా దాటవేశారు. సమయం వచ్చినప్పుడు చెబుతానని అన్నారు. ఆ సమయం ఎప్పుడు వస్తుందని ప్రశ్నించగా, వచ్చే ఏడాది మేలో చెబుతానని ఆయన సమాధానమిచ్చారు.

# బిఆర్ఎస్‌కు భవిష్యత్తు లేదు...

(మొదటి పేజీ తరువాయి)

అప్పుడు హైదరాబాద్‌తో పోటీ పడేందుకు ఎవరికీ సాధ్యం కాదన్నారు.

ప్రజల్లో బిఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్‌కు ఉన్నంత అభిమానం ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌కు లేదన్నారు. బిఆర్ఎస్ పదేళ్ళు అధికారంలో ఉండి చేయలేని అభివృద్ధిని తమ ప్రభుత్వం రెండేళ్ళలో చేశామని ఆయన వివరించారు. ఓట్ చోర్ గద్దీ చోడ్ పేరిట తమ పార్టీ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ చేపట్టిన ప్రజా ఉద్యమంతో దేశ ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తున్నదని అన్నారు. ఢిల్లీలో నిర్వహించిన మహా ధర్నాతో కేంద్రానికి 'సెగ' తగులుతుందని భావిస్తున్నానని ఆయన చెప్పారు.

దేశ వ్యాప్తంగా చేపట్టిన సంతకాల సేకరణతో ఐదున్నర కోట్ల మంది ముందుకు వచ్చి సంతకాలు చేశారని ఆయన తెలిపారు. కేంద్ర ఎన్నికల కమిషన్‌ను కేంద్రం తమ జేబు సంస్థగా భావిస్తున్నదని మహేష్ కుమార్ గౌడ్ దుయ్యబట్టారు.

# అమ్మకు ఆప్యాయతతో...ఆహారం తినిపిస్తూ..

**"పాలడుగు"లో వినూత్న రీతిలో ఓటు అభ్యర్థించిన స్వతంత్ర అభ్యర్థి భగవంత్..**

మోత్కూరు, డిసెంబర్ 14(వార్తా వేదిక సూర్య): మండలంలోని పాలడుగు గ్రామంలో స్వతంత్ర అభ్యర్థి సర్పంచ్‌గా పోటీ చేస్తున్న అంతటి భగవంత్ ఆదివారం నాడు ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం నాడు ఇంటింటికి ప్రచారం చేస్తూ...ఈ క్రమంలోనే ఓ వృద్ధురాలికి ఆప్యాయతగా పలకరించి ఆహారాన్ని తినిపించారు. అనంతరం తనకు ఎన్నికల అధికారులు కేటాయించిన ఉంగరం గుర్తు పై ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా భగవంత్ మాట్లాడుతూ తనను గెలిపిస్తే పాలడుగు గ్రామంలో ప్రతి నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని తెలిపారు. పాలడుగు జనరల్ స్థానం అయినప్పటికీ ఒక బీసీ బిడ్డగా పోటీ చేస్తున్నానని, తనకు బీసీ, ఎస్సీ, ఎస్టీ ,మైనార్టీ వర్గాల తోపాటు అన్ని వర్గాల ప్రజలు ఆదరించి తనకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.



# రాష్ట్ర పోలీస్ కంప్లైంట్ అథారిటీ సభ్యులు వెంకటేశ్వర్లను మర్యాదపూర్వకంగా కలిసిన యాకయ్య

మోత్కూరు, డిసెంబర్ 14(వార్తా వేదిక సూర్య): రాష్ట్ర పోలీస్ కంప్లైంట్ అథారిటీ సభ్యులు డాక్టర్ వద్రె వెంకటేశ్వర్లను అంతర్జాతీయ మానవ



హక్కుల కమీషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బుంగపట్ల యాకయ్య ముదిరాజ్ ఆదివారం నాడు హైదరాబాద్ లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి మేమొంటో అందించి శాలువా"తో సన్మానించినట్లు యాకయ్య తెలిపారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చే వినతులను పోలీసులు సకాలంలో పట్టించుకోకుంటే తమ దృష్టికి తీసుకురావచ్చునని వెంకటేశ్వర్లు సూచించినట్లు యాకయ్య తెలిపారు.

# అంబాల గ్రామ అభివృద్ధి లక్ష్యంగా అందరం కలిసికట్టుగా పని చేద్దాం..

**- కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిద్దాం: బీర్ల ఐలయ్య**

గుండాల, డిసెంబర్ 14(వార్తా వేదిక సూర్య): అంబాల గ్రామానికి ఎల్లవేళలా అండగా ఉంటా కాంగ్రెస్ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి పైల ఎల్లమ్మ సత్తయ్య ను భారీ మెజార్టీతో గెలిపించండి: తెలంగాణ ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే యాదాద్రి డిసిసి బీర్ల ఐలయ్య సీనియర్ నాయకులు తాళ్ల పెల్లి సోమయ్య గౌడ్ కి సన్మానం యాదాద్రి భువనగిరి జిల్లా అంబాల గ్రామానికి చెందిన గ్రామపంచాయతీ ఎలక్షన్ల ప్రచారంలో భాగంగా తెలంగాణ ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే యాదాద్రి డిసిసి అధ్యక్షులు బీర్ల ఐలయ్య గ్రామంలో ప్రచార కార్యక్రమం నిర్వహించారు ప్రచార కార్యక్రమంలో భాగంగా సర్పంచ్ సర్పంచ్ అభ్యర్థి పైల ఎల్లమ్మ సత్తయ్య భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు గ్రామ అభివృద్ధికి ఎల్లవేళలా సహకరిస్తానని తెలియజేశారు అదేవిధంగా గ్రామంలో సీనియర్ నాయకులు గౌడ సంఘం అధ్యక్షులు తాళ్లపల్లి సోమయ్యకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు అభినందనలు తెలియజేశారు.



# కాంగ్రెస్ పార్టీ బలపర్చి గెలిచిన నూతన సర్పంచ్‌లకు అభినందనలు


**-ఓబీసీ మండల అధ్యక్షులు బత్తిని ఉప్పలయ్య గౌడ్**

ఆత్మకూరు (ఎం), డిసెంబర్ 14 (వార్త వేదిక సూర్య): యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం) మండలం ఇటీవల సర్పంచ్ ఎన్నికలు జరిగిన సందర్భంగా సర్పంచ్‌గా పోటీ చేసి గెలిచిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు శుభాకాంక్షలు తెలిపిన ఓబీసీ మండల అధ్యక్షులు బత్తిని ఉప్పలయ్య గౌడ్.అనంతరం ఆయన మాట్లాడుతూ పోరాడి ఓడిన పార్టీ అభ్యర్థులకు గుండెధైర్యంతో ఉండాలని గెలుపోటములు సహజంమని మీకుపార్టీ,నాయకులు, కార్యకర్తలు, మేము అండగా ఉంటాం మీరు ఓడిన ఊరి ప్రజలకు ఏదో ఒక రూపంలో ఐలన్న సహకారంతో నిధులు,సంక్షేమ పథకాలు, సేవ, సహాయం చేయాలని అన్నారు.



# నీతి నిజాయితీ గల వారినే ప్రజా ప్రతినిధులుగా ఎన్నుకోవాలి

మోత్కూరు, డిసెంబర్ 14(వార్తా వేదిక సూర్య): స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటర్లు ఆలోచించి ప్రతి నిత్యం ప్రజలల్లో ఉంటూ, నీతి నిజాయితీ గల నిస్వార్థ నాయకులకే ఓటు వేసి నిజమైన ప్రజా సేవకులనే గ్రామాలలో సర్పంచ్ , వార్డు సభ్యులుగా ఎన్నుకోవాలని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు కోరారు. ఆదివారం నాడు మోత్కూరు మండలం పాలడుగు గ్రామంలో 2, 10వ వార్డులలో సిపిఎం పార్టీ బలపర్చిన అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ




సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ప్రలోభాలకు లోను కాకుండా నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ, గ్రామంలో ప్రజా సమస్యలను పరిష్కరించే నాయకులనే గెలిపించాలన్నారు. పాలకుల ప్రజా వ్యతిరేక విధానాలపై, ప్రజా సమస్యల పరిష్కారానికై నిరంతరం ఉద్యమాలు నిర్వహిస్తూ, నిస్వార్థంగా ప్రజా సేవ చేయాలనే ఆలోచన కల్గిన వామపక్ష బావజాలం ఉన్న, సిపిఎం పార్టీ బల పర్చిన వారినే ప్రజా ప్రతినిధిగా ఎన్నుకుంటే, సమస్యల పరిష్కారంతో పాటు గ్రామాల అభివృద్ధి సాధ్యం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం బల పర్చిన అభ్యర్థులు కొంపల్లి గంగయ్య,, పిట్టల చంద్రయ్య, మండల కమిటీ సభ్యురాలు కొంపల్లి ముత్తమ్మ,, చింతకింది సోమరాజు,, దడిపల్లి సైదులు, వడ్డేపల్లి లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

www.vaarthavedhikasurya.com
వార్త వేదిక సూర్య
తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY





## దూలూరు సర్పంచికి ఆత్మీయ సన్మానం

**కోరుట్ల, డిసెంబర్ 14(వార్తా వేదిక సూర్య):**
కథలాపూర్ మండలం దూలూరు గ్రామానికి నూతనంగా ఎన్నికైన రజియా బేగం అజీమ్ లకు కోరుట్ల పట్టణానికి చెందిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ మాజీ ప్రధాన కార్యదర్శి సాయిబాబా ఆలయ ధర్మకర్త నేమూరి భూమయ్య ఆధ్వర్యంలో ఇటీవల ఎన్నికల్లో గెలుపొందిన రజియా బేగంను ఘనంగా సన్మానించారు ఈ సందర్భంగానేమూరి భూమయ్య మాట్లాడుతూ గ్రామఅభివృద్ధి చేయాలని అన్నారు. కోరుట్ల మార్కెట్ కమిటీ డైరెక్టర్ శ్రీరాముల అమరేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అండతో గ్రామాన్ని అభివృద్ధిలో పరిగెత్తించాలని కోరారు వీరు ఇంకా ఉన్నతమైన పదవులను అధిరోహించాలని ఆశించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు శ్రీరాముల రవి, డాక్టర్ రమేష్, గడ్డం అరుణ్ తదితరులు పాల్గొన్నారు

## సర్పంచ్‌గా గెలిపిస్తే ఊరు అభివృద్ధి చేస్తా..

**కాంగ్రెస్ అభ్యర్థి మీదె ప్రమీల గోపాల్ రెడ్డి**

**మహేశ్వరం, డిసెంబర్ 14(వార్తా వేదిక సూర్య):** మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండలం నాగిరెడ్డిపల్లి గ్రామపంచాయతీని అభివృద్ధి చేస్తా. మహేశ్వరం మండలం నాగిరెడ్డిపల్లి గ్రామ ప్రజలు ఆశీర్వదించి గెలిపిస్తే అన్ని రంగాల్లో అభివృద్ధి చేశానని నాగిరెడ్డిపల్లి గ్రామపంచాయతీ కాంగ్రెస్ పార్టీ బలపరి



చిన అభ్యర్థి మిద్దె ప్రమీల గోపాల్ రెడ్డి, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనే రంగాల్లో అభివృద్ధి చేయడం లక్ష్యంగా పనిచేస్తానని ముఖ్యంగా మా గ్రామంలో ఉన్న ప్రతి ఇంటికి టాక్సీలు, ఫిల్టర్ వాటర్ ఉచితంగా ఇవ్వడం,ఆడపిల్ల పుడితే 5000 రూపాయలు డిపాజిట్, sc,Bc కమ్యూనిటీ హాల్ ను నిర్మిస్తాం, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు కోసం చేస్తామని అన్నారు. నాగిరెడ్డిపల్లి గ్రామపంచాయతీ ఆదర్శవంతమైన గ్రామంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తానని . అధిక నిధులు తీసుకొచ్చి గ్రామాన్ని అభివృద్ధి బాటలో నడిపించడానికి నా వంతు కృషి చేస్తానని మిద్దె ప్రమీల గోపాల్ రెడ్డి, అన్నారు. గ్రామ అభివృద్ధి కోసం ప్రజలకు సేవ చేయడానికి ముందుకు వస్తున్నాను అని మీ అమూల్యమైన ఓటు కత్తెర గుర్తుకు,వేసి ఆశీర్వదించి గెలిపించాలని విద్య ప్రమీల గోపాల్ రెడ్డి అన్నారు.

## రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని పరామర్శించిన మల్లేష్ గౌడ్


**మోటకొండూరు, డిసెంబర్ 14(వార్తా వేదిక సూర్య):**
మోటకొండూరు మండలం కొండాపురం గ్రామానికీ చెందిన మణి గౌడ్ రోడ్డు ప్రమాదంలో నాలుగు వెళ్ళు విరిగాయి.విషయం తెలుసున్న సర్ధార్ సర్వాయి



పాపన్న గీత కార్మిక సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పంజాల మల్లేశ్ గౌడ్ బాధితున్ని భువనగిరి ఏరియా ఆసుపత్రిలో కలిసి పరామర్శించారు.ఈ కార్యక్రమంలో పంజాల మల్లేష్ గౌడ్, పంజాల కృష్ణ గౌడ్, గుడ్డేటి సుభాష్, పంజాల రాములు గౌడ్, పంజాల ప్రమీల గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచ్ ఎర్ర సోమిరెడ్డిని ఘనంగా సత్కరించిన శ్రీనివాస్, నవీన్

**ఆత్మకూరు (ఎం), డిసెంబర్ 14 (వార్త వేదిక సూర్య):**
యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం) మండలం లింగరాజుపల్లి గ్రామ నూతన సర్పంచిగా ఎన్నికైన ఎర్ర సోమిరెడ్డి,ఉప సర్పంచ్ ఇంజమూరి భిక్షపతి ని



మర్యాద పూర్వకంగా కలిసిన బీఆర్ఎస్ మండల నాయకులు మంగ శ్రీనివాస్, దండు నవీన్.అనంతరం వారికి ఘనంగా సన్మానించి శాలువ తో సత్కరించారు.







# బిఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించండి..

**డిసిసిబి మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి**

**చందేపల్లి, వర్టురు, అమ్మనబోలు,అబిద్ నగర్‌లలో బిఆర్ఎస్ బలపరచిన సర్పంచ్ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం**

**మోటకొండూరు, డిసెంబర్ 14(వార్తా వేదిక సూర్య):** ఆరు గ్యారెంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలం ఆయింది అని డిసిసిబి మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి అన్నారు.రెండవ సాధారణ గ్రామపంచాయతీ ఎన్నికల సందర్భంగా మూడో విడత ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం మండలంలోని బిఆర్ఎస్ అభ్యర్థులు చందేపల్లి కాడిగల్ల నరసింహులు, వర్టూర్ సుదగాని వరలక్ష్మి రాందాస్ గౌడ్, అమ్మనబోల్ మామిడాల నరసమ్మ మల్లయ్య, అబిద్ నగర్ నాయిని అమరావతి రామచంద్ర రెడ్డి వారికి కేటాయించిన గుర్తులపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 6 గ్యారంటీల కార్డు పేరుతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం మోసపూరితమైన హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిందని అన్నారు. మహిళలకు బస్ ఫ్రీ అని పురుషులకు బస్ ఛార్జీలు డబుల్ పెంచరాని అన్నారు, బస్సు ఫ్రీ వల్ల హైదరాబాద్ నుండి లక్ష రూపాయల జీతం వచ్చే ఉద్యోగం చేసే మహిళల లెక్కే లాభం చేకూరింది అని, వృద్ధులకు, గీత కార్మికులకు, వితంతులకు పెన్షన్ పెంచలేదని, మహిళలకు 2500 రూపాయలు ఇవ్వలేదని రెండు సంవత్సరాల పేరు మీద ప్రతి మహిళలకి 62500 రూపాయలు కాంగ్రెస్ ప్రభుత్వం బాకీ ఉన్నదని అన్నారు, ఒక సంవత్సరం రైతుబంధు ఇవ్వలేదని, పెళ్లి చేసుకున్న ఆడపడుచులకు తులం బంగారం ఇవ్వట్లేదని, విద్యార్థులకు స్కూటీలు ఇస్తానని మోసం చేశారని, కేసీఆర్ కిట్ ఇవ్వట్లేదు అని, అధికారంలో ఏ పార్టీ ఉన్న ప్రతి గ్రామానికి నిధులు వస్తాయని ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం మోసపూరిత మాటలు నమ్మొద్దని బిఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులు అత్యధిక మెజారిటీతో గెలిపించండి కోరారు. తెలంగాణ రాజ్య అధికార పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సుదగాని హరిశంకర్ గౌడ్ మాట్లాడుతూ...

గత 20 సంవత్సరాలుగా వర్టూర్ గ్రామ అభివృద్ధికి నా వంతు సహాయ సహకారాలు అందిస్తున్నాని, పార్టీలకతీతంగా అభివృద్ధి చేసే అభ్యర్థినే గెలిపించాలని, సుదగాని వరలక్ష్మి రాందాస్ గౌడ్ కత్తెర గుర్తుకు ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కల్లూరు రామ చంద్రారెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు యాదయ్య ,మాజీ మండల పార్టీ అధ్యక్షులు దూదిపాల రవీందర్ రెడ్డి, గ్రామశాఖ అధ్యక్షులు శ్రీనివాస్ చారి, మండల నాయకులు అరవింద్ రెడ్డి, కృష్ణ, లక్ష్మీ నరసయ్య, వెంకటాచారి, సునీల్ రెడ్డి, అమరేందర్, శ్రీనివాస్, నరేష్, శ్రీనివాస్ రెడ్డి, కాదూరి శ్రీను, బీస కృష్ణంరాజు గౌడ్, లవన్ రెడ్డి, శ్రీను, బైరపాక స్వామి, తదితరులు పాల్గొన్నారు.





# మహేశ్వరం సర్పంచ్ అభ్యర్థి కాకి ఈశ్వర్‌ను గెలిపిస్తేనే అభివృద్ధి

**మహేశ్వరంలో కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థి కాకి ఈశ్వర్, ప్రచారంలో హస్తం ప్రభంజనం**

**గత పది ఏళ్లలో అభివృద్ధి నోచుకోని మహేశ్వరం**

**అధికారంలో ఉన్న పార్టీ అభ్యర్థిని గెలిపిస్తే అన్ని రంగాలలో అభివృద్ధి**

**మహేశ్వరంలో కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి కాకి ఈశ్వర్ భారీ ర్యాలీ**

**మాజీ జెడ్పి చైర్మన్ అనిత హరినాద్ రెడ్డి**

**టీపీసీసీ సభ్యుడు టీపీసీసీ మెంబర్ దేప భాస్కర్ రెడ్డి**

**మహేశ్వరం, డిసెంబర్ 14(వార్తా వేదిక సూర్య):** మహేశ్వరం సర్పంచ్ అభ్యర్థి కాకి ఈశ్వర్‌ను గెలిపిస్తేనే అభివృద్ధి జరుగుతుందని మాజీ జెడ్పి చైర్మన్ అనిత హరినాద్ రెడ్డి, టీపీసీసీ మెంబర్ దేప భాస్కర్ రెడ్డి అన్నారు. స్థానిక ఎన్నికల సందర్భంగా



మహేశ్వరం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి కాకి ఈశ్వర్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున భారీగా ప్రజలతో ర్యాలీ నిర్వహిస్తూ ప్రజలను ఉంగరం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలంటూ ప్రచారం నిర్వహించారు. అనంతరం కాకి ఈశ్వర్ ఫంక్షన్ హాల్ లో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి విచ్చేసిన మాజీ జెడ్పి చైర్మన్ అనిత హరినాద్ రెడ్డి, టీపీసీసీ సభ్యుడు టీపీసీసీ మెంబర్ దేప భాస్కర్ రెడ్డి, మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కాకి ఈశ్వర్ ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. గత పది సంవత్సరాలుగా మహేశ్వరం అభివృద్ధి జరగకుండా కుంటు పడిందని కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నందున పార్టీ అభ్యర్థి గెలిపిస్తే సంక్షేమ పథకాలు అభివృద్ధి జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ చేస్తున్న సంక్షేమ పథకాలు రేషన్ కార్డు ,ఇందిరమ్మ ఇండ్లు , సన్న బియ్యం, ఉచిత విద్యుత్,ఉచిత బస్సు, రైతులకు రుణమాఫీ అనేక సంక్షేమ పథకాలు పేద ప్రజలకు అందిస్తుందని కాకి ఈశ్వర్ ను గెలిస్తే మహేశ్వరం గ్రామాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేయడానికి అవకాశం ఉంటుందని పేద ప్రజల కోసం ఇండ్లు లేని నిరుపేదల కోసం 10 ఎకరాల స్థలం తీసుకొని ప్రతి ఒక్కరికి సొంత ఇల్లు కట్టిస్తానని కాకి ఈశ్వర్ హామీ ఇచ్చారు. అభివృద్ధి కోసం కాకి ఈశ్వర్ ఉంగరం గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పోటీ చేస్తున్న వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

# కాటేపల్లి బిజెపి సర్పంచ్ అభ్యర్థి భూరెడ్డి రేణుక జనమేజయ రెడ్డినీ గెలిపించండి

**బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పడాల శ్రీనివాస్**

**మోటకొండూరు, డిసెంబర్ 14(వార్తా వేదిక సూర్య):**
డబ్బు మద్యం చూసి ఓటు వేస్తే గ్రామం అభివృద్ధి జరగదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పడాల శ్రీనివాస్ అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండలం కాటేపల్లి గ్రామంలో టిడిపి బలపరచిన బిజెపి సర్పంచ్ అభ్యర్థి భూరెడ్డి రేణుక



జనమేజయ రెడ్డికి మద్దతుగా ప్రచారంలో పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో నిర్వహించిన బహిరంగ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సర్పంచ్ ఎన్నికల్లో పార్టీలు ,కులాలు,మతాలు కాకుండా సేవ చేసే, అభివృద్ధి చేసే వారికి ఓటు వేయాలని అన్నారు. అధికార పార్టీ





వారికే ఓటు వేస్తే అభివృద్ధి అవుతుంది అని కొందరు ప్రచారాలు చేస్తున్నారు అవన్నీ తప్పుడు ప్రచారాలు అని అన్నారు.గ్రామ పంచాయితీలు కేంద్రం నేరుగా నిధులు వేస్తుందని తెలిపారు. కాటేపల్లిలో బీజేపీ బలపరచిన అభ్యర్థి భూరెడ్డి రేణుకా జనమేజయ రెడ్డి బ్యాట్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. సర్పంచ్ అభ్యర్థి భురెడ్డి జనమేజయ రెడ్డి మాట్లాడుతూ కాటేపల్లి గ్రామ ప్రజలు ఒక్కసారి ఆలోచించి డబ్బు మద్యం ఇంకా ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా నాకు ఓటు వేయాలని అన్నారు.డబ్బు పంచడం నాకు సులువైన పనే అని కానీ డబ్బు పంచిన వారు ఎవ్వరు కూడా సేవ చేయలేరని పంచిన డబ్బు ఎలా తిరిగిరాబట్టుకోవాలని చూస్తారని అన్నారు.నేను గ్రామంలో ఉండను అని చేస్తున్న ప్రచారం వాస్తవమే కాని అధి గతం అని ఇక ముందు గెలిచిన ఓడిన నేను ఉండేది గ్రామంలోనే అని అన్నారు.గ్రామాన్ని మోడల్ గ్రామ పంచాయితీ గా తీర్చి దిద్దే బాధ్యత నాది అని అన్నారు.గ్రామ యువత సహకారం తీసుకుని గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్త అని తెలిపారు.నా ప్రత్యర్థులు ఇద్దరు కూడా గతంలో పాలన చేసిన వారే అని వారి తరం ఇక ముగిసింది మన యువతరం అధికారంలో వస్తె గ్రామాన్ని మరింత ముందుకు తీసుకువెళ్తం అని అన్నారు. మీరు నాకు వేసే ఓటు గ్రామ అభివృద్ధి కి బాట వేస్తుంది అని గుర్తు పెట్టుకొని నా బ్యాట్ గుర్తు పై ఓటు వేయాలని కోరుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షుడు యెల్లంల శ్రీధర్ రెడ్డి,జిల్లా నాయకులు జొరుక ఏల్లేష్, దాసం నాగరాజు,పవన్, సతీష్,గణేష్, నవీన్,మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులనే గెలిపించాలి

**- ఎమ్మెల్యే సామేల్**

**మోత్కూరు, డిసెంబర్ 14(వార్తా వేదిక సూర్య):**
స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థులనే గెలిపించాలని తుంగతుర్తి శాసన సభ్యులు మందుల సామేల్ కోరారు. ఆదివారం నాడు మండలంలోని రాగి బావి, పనకబండ, ముశిపట్ల, దత్తప్ప గూడెం, పాలడుగు, అనాజి పురం, పాటిమట్ల గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ బల పర్చిన అభ్యర్థులకు మద్దతుగా ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లలోనే పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని అన్నారు.

గత పదేళ్లలో రాష్ట్రంలో ఏ నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇండ్లు గాని పేద ప్రజలకు రేషన్ కార్డులు అందించలేని దిస్థితిలో ఏర్పడిం



దని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలంలోనే నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లను, రేషన్ కార్డులు అర్హులైన లబ్ధిదారులందరికీ అందించ డంతోపాటు కొన్ని కుటుంబాలలో చిన్నపిల్లల పేర్లను నమోదు కూడా చేయించినట్లు తెలిపారు. పేదలకు సంక్షేమ ఫలాలు అందాలంటే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులనే ఆదరించి గెలిపించాలన్నారు.

ఈ సందర్భంగా వివిధ గ్రామాలలో ఎమ్మెల్యే సామేల్ ప్రజలతో మమేకమై కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్ అభ్యర్థులు నకరికంటి సైదమ్మ, రామ నర్సయ్య పైళ్ల నర్సిరెడ్డి, గంట పద్మ,యాస నర్సిరెడ్డి, గుండు యాదగిరి, బీసు వెంకటయ్య, బండారమ, విజయ్ రెడ్డి లతో పాటు ఏపీ ఐడిసి మాజీ డైరెక్టర్ కంచర్ల యాదగిరి రెడ్డి, డిసిసి ఉపాధ్యక్షులు పైళ్ల సోమిరెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు గుర్రం లక్ష్మీనర్సింహ్మారెడ్డి, అవిశెట్టి ఆవిలిమల్లు, మోత్కూరు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు గుండు రామచంద్రు గౌడ్, వివిధ గ్రామాల చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.





# ఎన్నికల నిర్వహణ పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవు

- రెండవ విడత గ్రామపంచాయతీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన గ్రామపంచాయతీ ఎన్నికల జిల్లా సాధారణ పరిశీలకురాలు కొర్ర లక్ష్మి, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి.
- దామరచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రంలోని ఒక బూతులో ఎక్కువ మంది ఓటర్లు ఉండడంపై ప్రిసైడింగ్ అధికారిపై జిల్లా కలెక్టర్ ఆగ్రహం.
- పోలింగ్ కేంద్రం నిర్వహణలో నిర్లక్ష్యం వహించినదుకుగాను పి ఓ సంధ్యకు షోకజ్ నోటీసు జారీ చేయాలని ఆదేశించిన జిల్లా కలెక్టర్.

**నల్లగొండ, డిసెంబర్ 14 (వార్తా వేదిక సూర్య):** రెండో విడత గ్రామపంచాయతీ ఎన్నికల పోలింగ్‌లో భాగంగా ఆదివారం జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, జిల్లా సాధారణ పరిశీలకురాలు, ఐఏఎస్ అధికారి కొర్ర లక్ష్మితో కలిసి మిర్యాలగూడ డివిజన్లోని దామరచర్ల మండల కేంద్రంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓటు వేసేందుకు వచ్చిన ఓటర్లతో ముఖాముఖి మాట్లాడడమే కాకుండా, ఓటు వేసేందుకు గుర్తింపుగా తీసుకువచ్చిన గుర్తింపు కార్డుల గురించి జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉన్నత పాఠశాల ఆవరణలోని ఒక పోలింగ్ బూతులో పోలింగ్ పరిస్థితిని గమనించిన జిల్లా కలెక్టర్ పరిమితికి మించి ఓటర్లు పోలింగ్ కేంద్రంలో ఉండడం పట్ల ప్రిసైడింగ్ అధికారిపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.పోలింగ్ కేంద్రం నిర్వహణలో నిర్లక్ష్యం వహించినందుకుగాను ప్రిసైడింగ్ అధికారి ,స్కూల్ అసిస్టెంట్ సంధ్య కు షోకాజ్ నోటీస్ జారిచేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని ప్రతిరోజూ




టేలికాన్ఫరెన్సుతో పాటు, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి తెలియజేసినప్పటికీ నిర్లక్ష్యంగా వ్యవహరించడం పట్ల ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు.

పోలింగ్ అనంతరం కౌంటింగ్ ను జాగ్రత్తగా నిర్వహించాలని ఆర్ ఓలు అత్యవసరమై బయటికి వెళ్ళవలసి వస్తే తప్పనిసరిగా ఒక గజిటెడ్ ఆఫీసర్ కు స్టాచ్యూటరీ మెటీరియల్ అప్పగించి వెళ్ళాలని తెలిపారు. అన్ని పోలింగ్ కేంద్రాల నుండి పోలైన బాలెట్స్ తో పాటు, ఎన్నికల సామాగ్రి వచ్చిన తర్వాత దగ్గరలోని ఎస్టిఓలో భద్రపరిచే బాధ్యత ఎంపీడీవోదని అన్నారి.అనంతరం జిల్లా కలెక్టర్ మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ.. దామరచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10 వార్డులకు పోలింగ్ జరుగుతున్నదని, ప్రశాంతంగా పోలింగ్ కొనసాగుతున్నదని, ఉదయం 11 గంటల వరకు 32 శాతం ఓట్లు పోలైనట్లు తెలిపారు. దామరచర్ల మండలం పెద్ద మండలం అయినందున కౌంటింగ్ లో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. పోలింగ్ పూర్తి అయిన తర్వాత మధ్యాహ్నం 2 గంటలకు కౌంటింగ్ ప్రారంభమవుతుందని, ఎన్నికల కమిషన్ నియమ నిబంధనల ప్రకారం కౌంటింగ్ చేపట్టాలని, ఫలితాల ప్రకటనలో ఎలాంటి జాప్యం చేయవద్దని ఈ సందర్భంగా ఆమె స్టేజ్ టు రిటర్నింగ్ అధికారిని ఆదేశించారు.

ఎక్కడ ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పకడ్బందీగా కౌంటింగ్ నిర్వహించాలని చెప్పారు. అంతకుముందు మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్ రెండవ విడత గ్రామపంచాయతీ ఎన్నికలు జరుగుతున్న మిర్యాలగూడ డివిజన్ పరిధిలోని అన్ని మండలాలలో పోలింగ్ ప్రశాంతంగా కొనసాగుతున్నట్లు ఎన్నికల పరిశీలకురాలు,జిల్లా కలెక్టర్లకు వివరించారు. మిర్యాలగూడ సబ్ కలెక్టర్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ నారాయణ అమిత్ తో పాటు, డిపిఓ వెంకయ్య ,దామరచర్ల ప్రత్యేక అధికారి, డిసిఓ పత్యా నాయక్, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ రమేష్ ,తదితరులు ఉన్నారు.

# మన ఊరు మన భవిష్యత్తుకు బాటలు వేస్తా..

- కేతావత్ రేణుక రమేష్ నాయక్‌కు అడుగడుగునా ఆదరణ
- గ్రామ ప్రజలు మెజారిటీగా గెలుపును కోరుకుంటున్నారు.
- సమస్య మీది ...పరిష్కారం నాది
- సర్పంచ్‌గా నన్ను ఆదరించండి గ్రామ అభివృద్ధికి మీ విధేయుడుగా పనిచేస్తా.
- యల్మల తండా స్వతంత్ర అభ్యర్థి : కేతావత్ రేణుక రమేష్ నాయక్

**నల్లగొండ,డిసెంబర్ 14 (వార్తా వేదిక సూర్య):** ఎల్మలతండ గ్రామ సర్పంచ్ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న గ్రామ అభివృద్ధికి,మీ తోబుట్టుగా ఉండి సమస్యల పరిష్కారం కొరకు పనిచేస్తానని కెతావత్ రేణుక రమేష్ నాయక్ అన్నారు. ఉన్నత చదువులు చదువుకొని, గత 15 ఏళ్లుగా రాజకీయాల్లో గ్రామంలో ప్రజాక్షేత్రంలో ఉంటూ, విద్యార్థి నాయకుడిగా,వామపక్ష భావజాలంతో పనిచేస్తూ, తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించాడు.తెలంగాణ ఉద్యమంలో ఎన్నో కేసులు పెట్టిన భయపడకుండా ప్రజల కోసం ఉద్యమంలో క్రియాశీలకంగా పాల్గొన్నాడు.యల్మల తండ గ్రామంపై పట్టున్న నాయకుడిగా, రాజకీయ నాయకుడిగా మీ ముందుకు వచ్చి,గ్రామ అభివృద్ధికి స్వతంత్ర సర్పంచ్ అభ్యర్థిగా ఈ సందర్భంగా యల్మల తండ గ్రామస్తులకు హామీలు ప్రకటించారు. మన గ్రామంలో ప్రతి ఇంటికి త్రాగునీరు నీరు అందిస్తాను.ప్రతి వార్డుకు లింకు రోడ్లు ఏర్పాటు చేస్తాను,ప్రతి ఇంటికి కరెంటు,



ఇంటిముందు,ముందు బజార్లో స్ట్రీట్ లైట్లు ఏర్పాటు చేస్తాను, ప్రతి విద్యార్థికి చదువుకునేందుకు యూకేజీ నుంచి పీజీ వరకు ప్రోత్సహిస్తాను.అదేవిధంగా మన గ్రామంలో ప్రతి ఒక్కరి ఆరోగ్యం పై శ్రద్ధ తీసుకొని ఆరోగ్య సేవలు అందే విధంగా ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకుంటా ప్రాథమిక ఉప కేంద్రాన్ని ఏర్పాటు చేయిస్తాను.మన గ్రామంలో ప్రధాన అవసరాలను పరిష్కరిస్తాను.యువతకు ప్రాముఖ్యత..చదువుకున్న నిరుద్యోగ యువతకు ప్రోత్సహించి మన గ్రామంలో ఉద్యోగ మేళాను ఏర్పాటు చేస్తాను.స్కిల్ డెవలప్మెంట్ వర్క్ షాప్ ను ఏర్పాటు చేయిస్తా. యువతకు క్రీడలను ప్రోత్సహించేందుకు క్రీడా ప్రాణంగాన్ని ఏర్పాటు చేపిస్తా, స్పోర్ట్స్ టోర్నమెంట్స్ వంటి కార్యక్రమాలు చేపడతాను సపోర్టు చేయండి.సమాజ సేవ చేసేందుకు మీ ముందుకు వచ్చిన మీ సమస్య ఏదైనా నా వంతుగా, శక్తి మేరకు పరిష్కారం చేస్తాను.

గ్రామంలో స్థానికంగా ఉండి, నమ్మకంగా స్థిరమైన పనులు చేపడతాను.మీ ఆదరణ నా గెలుపుకు పునాది.మన గ్రామంలో విదేశాలకు వెళ్లే విద్యార్థులను ప్రోత్సహించి, వారికి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తాను.

మన గ్రామానికి మార్పు తీసుకొస్తాను,మార్పు తీసుకురావడానికి, సమస్యల పరిష్కారం కొరకు నేను పోటీ పడతాను.24 గంటలు మీకోసం ఊర్లోనే ఉంటాను,గ్రామంలో వార్డుల వారిగా సమస్యలను గుర్తించి పరిష్కరిస్తాను.

గ్రామంలో గ్రంథాలయం ఏర్పాటు చేపిస్తా,సీసీ కెమెరాలు, మినరల్ వాటర్ ప్లాంట్,ఉద్యోగమేల,హెల్త్ క్యాంపు ఏర్పాటు చేపిస్తాను హామీ ఇస్తున్నాను.గ్రామంలో ప్రతి సమస్యను గుర్తించి పరిష్కారం చూపిస్తాను.మహిళలకు ప్రోత్సాహం అందిస్తా,మీ ఓటు నా గెలుపుకు బాటలు వేస్తుంది,నా గెలుపు తో గ్రామ అభివృద్ధికి బాటలు వేస్తాను.

గ్రామంలో పెద్ద ఎత్తున ప్రభుత్వ పరంగా వచ్చే నిధులను ప్రజా సమక్షంలో అమలు చేస్తాను. మీ బలమైన సపోర్టు నాకు అందించండి సర్పంచ్‌గా గెలిచి మరిన్ని అవకాశాలు గ్రామానికి తీసుకువచ్చి అడుగడుగునా అభివృద్ధికి బాటలు వేస్తానని రమేష్ రేణుక నాయక్ లు గ్రామ ప్రజలకు వరాలు ఇచ్చారు.

# మీడియా ప్రతినిధిపై సిఐ బీసన్న దురుసు ప్రవర్తనను తీవ్రంగా ఖండిస్తున్నాం : నల్గొండ ప్రెస్ క్లబ్

**నల్లగొండ,డిసెంబర్ 14 (వార్తా వేదిక సూర్య):**

నల్గొండ జిల్లా పెద్దవూరలో పంచాయతీ ఎన్నికల కవరేజ్‌లో నిమగ్నమైన మీడియా ప్రతినిధిపై సిఐ బీసన్న దౌర్జన్యానికి పాల్పడడాన్ని నల్గొండ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు యరెడ్ల చంద్రశేఖర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి వంగాల శ్రీనివాస్ రెడ్డి, కోశాధికారి గుండాల యాదగిరి తీవ్రంగా ఖండించారు.

మీడియా ప్రతినిధి పై దురుసు ప్రవర్తనను తీవ్రంగా ఖండిస్తున్నామని వారు తెలిపారు. ప్రజాస్వామ్యంలో మీడియా నాల్గవ స్తంభంగా పనిచేస్తుందని, ఎన్నికల వంటి కీలక సందర్భాల్లో స్వేచ్ఛగా, నిర్భయంగా విధులు నిర్వహించే హక్కు జర్నలిస్టులకు ఉందని వారు గుర్తు చేశారు.



అధికారులు బాధ్యతాయుతంగా ప్రవర్తించి, మీడియా స్వేచ్ఛను గౌరవించాలని, ఇలాంటి ఘటనలు ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధం మరియు అనుచితమని పేర్కొన్నారు. మీడియా ప్రతినిధిపై దౌర్జన్యం చేయడమే కాక, అదుపులోకి తీసుకొని జీపులో ఎక్కించి అక్కడ నుండి తరలించి దుశ్చర్యకు పాల్పడిన సీఐ బీసన్నపై చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ, పోలీస్ ఉన్నతాధికారులను కోరుతున్నామ న్నారు. లేదంటే తాము రాష్ట్ర వ్యాప్తంగా నిరసనకు దిగాల్సి ఉంటుందని హెచ్చరించారు. మీడియా సిబ్బంది సురక్షితంగా విధులు నిర్వహించే వాతావరణం కోసం అందరూ కృషి చేయాలని నల్గొండ ప్రెస్ క్లబ్ డిమాండ్ చేస్తుందన్నారు.

# నల్లగొండలో సిఎస్‌కు ఘన స్వాగతం

**నల్లగొండ, డిసెంబర్ 14 (వార్తా వేదిక సూర్య):**
రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే.రామకృష్ణారావు ఆదివారం నాగార్జునసాగర్ లో ఉన్న ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఆంధ్రప్రదేశ్ గురుకుల జూనియర్ కళాశాల స్వర్ణోత్సవ వేడుకలలో పాల్గొనే నిమిత్తం నాగార్జున సాగర్ వెళుతూ మార్గ మధ్యంలో నల్గొండ జిల్లా కేంద్రానికి వచ్చారు. నల్గొండకు వచ్చిన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణా రావుకు జిల్లా కలెక్టర్ క్యాంప్ కార్యాలయం వద్ద జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి,జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, గ్రామపంచాయతీ ఎన్నికల జిల్లా సాధారణ పరిశీలకురాలు, ఐఏఎస్ అధికారి కోర్రా లక్ష్మి ,రాష్ట్ర మినరల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ వైస్ చైర్మన్ మరియు ఎండి ,ఐ ఏ ఎస్ అధికారి భవేష్ మిశ్రా,రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, పలువురు జిల్లా అధికారులు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి



పుష్ప గుచ్చాలతో ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా రాష్ట్ర



ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు.గతంలో తాను నల్గొండ జిల్లాలో జాయింట్ కలెక్టర్ గా పనిచేసిన రోజులను ఆయన గుర్తుకు తెచ్చుకున్నారు. నల్గొండ ఆర్డీవో వై. అశోక్ రెడ్డి ,జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి రమేష్, కలెక్టర్ కార్యాలయ ఏవో మోతిలాల్, తదితరులు ఉన్నారు.




## పోలిశెట్టి జూలియన్ సేవలు అభినందనీయం

**నల్లగొండ,డిసెంబర్ 14 (వార్తా వేదిక సూర్య):** ఫాదర్ పోలిశెట్టి జూలియన్ చేస్తున్న సేవలు అభినందనీయమని రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. ఇటీవల మలేషియా దేశంలోని కౌలాలంపూర్ లో గ్లోబల్ లీడర్స్ అవార్డ్స్ సెమినార్లో మదర్ తెరిసా రూరల్ డెవలప్మెంట్ సొసైటీ సంస్థ డైరెక్టర్ అయిన రెవరెండ్ ఫాదర్ పోలిశెట్టి జూలీయన్ ను ఘనంగా సన్మానించి అనంతరం ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు రైతులకు మహిళలకు అనేక సేవా కార్యక్రమాలు అందిస్తున్నందుకు గాను అంతర్జాతీయ అవార్డు రావడం ఎంతో గర్వించదగ్గదని



అన్నారు. 55 దేశాల ప్రతినిధుల పాల్గొన్న ఈ కార్యక్రమంలో అరుదైన పురస్కారం పొందడం జిల్లాకే గొప్ప పేరు అని కొనియాడారు. అనంతరం నల్లగొండ బిషప్ రెవరెండ్ కరణం ధమన్ కుమార్ ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో ఆలిండియా క్రిస్టియన్ కౌన్సిల్ పొలిటికల్ జనరల్ సెక్రెటరీ పసల శౌరయ్య, లూర్దు రాజు, తదితరులు పాల్గొన్నారు.

## డాన్స్ మాస్టర్ కల్లూరి వెంకటేశ్వర్లుకు డాక్టరేట్

**నల్లగొండ,డిసెంబర్ 14 (వార్తా వేదిక సూర్య):** నల్లగొండ జిల్లా నకిరేకల్‌కు చెందిన కల్లూరి వెంకటేశ్వర్లు తెలంగాణ నాట్య మేళంపై పరిశోధన చేసినందుకుగాను, ఉచితంగా బీద విద్యార్థులకు నాట్య విద్య నేర్పిస్తూ భోజన వసతి కల్పిస్తూ సేవా




దృక్పథంతో చేస్తున్న సేవలకు గాను చెన్నై గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ రాజా అన్న మలై మందిరంలో యూనివర్సిటీ చైర్మన్ మాన్యూల్, తమిళనాడు యూనివర్సిటీ వైస్ ఛాన్సర్ వెంకటేశన్, రిటైర్డ్ ప్రిన్సిపాల్ సెక్రెటరీ సంపత్ కుమార్, అరుణాచల్ ప్రదేశ్ హిమాలయ యూనివర్సిటీ వైస్ ఛాన్సర్ ప్రకాష్ దివ్యరాణ, నీలం యూనివర్సిటీ వైస్ ఛాన్సర్ షమీం అహ్మద్ లు గౌరవ డాక్టరేట్ ను అందజేశారు.

## వెల్మకన్నే గ్రామ అభివృద్దే తమ లక్ష్యం

**- సర్పంచ్ రావుల స్వప్న రమేష్**

**గట్టుప్పల, డిసెంబర్ 14 (వార్తా వేదిక సూర్య):**
వెల్మకన్నే గ్రామ సర్పంచ్‌గా నూతనంగా ఎన్నికైన సర్పంచ్ రావుల స్వప్న రమేష్ తన గ్రామ అభివృద్ధి తమ లక్ష్యమనితెలిపారు. తమ గెలుపులో భాగస్వామ్యమయిన కాంగ్రెస్ పార్టీ నాయకులకు నాకు మద్దతు ప్రకటించిన వివిధ పార్టీల నాయకులు గ్రామ పెద్దలు యువత ప్రజలందరూ కలిసి 458 ఓట్ల మెజార్టీతో గెలిపించిన



తనకు అండగా నిలిచిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి సహకారంతో వెల్మకన్నే గ్రామా పంచాయతీ లో ప్రధాన సమస్యలపై దృష్టి సారించి అన్నీ విధాలా అందరి సహకారంతో అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు.ప్రతి ఒక్కరికి ప్రజలకు అందుబాటులో ఉంటానని ప్రజల సంక్షేమనికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. నూతనంగా ఎన్నికైన వార్డు సభ్యుల సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చిదిద్దుతామని తెలిపారు.

Printed, Published and Owned by **POLOJU SRINIVASA CHARY**,and **Printed at SURYA DIGITAL PRINTERS,** H.No.132, Markondeya Nagar, Choutuppal Municipality, YadadriBhuvanagiri District, Telangana State508252., and Published at H.No. 132, Markondeya Nagar, Choutuppal Municipality, YadadriBhuvanagiri District, Telangana State508252. **Editor: POLOJU SRINIVASA CHARY. RNI No: TGTEL/25/A0305,** Cell:9985389183. **Email Id:vaarthavedhikasurya2025@gmail.com**